'తల్లికి వందనం'లో మెలికలు ఎన్నో..


స్టేట్‌మెంట్లు ఇచ్చే కౌంటర్ బయట క్యూలో నిరీక్షణ

300 యూనిట్లు వాడనేలేదు..


డెయిరీ ఫారం ప్రాంతానికి చెందిన కృష్ణ కుటుంబానికి తల్లికి వందనం నిధులు జమ కాలేదు. కారణమడిగితే సచివాలయ సిబ్బంది కరెంటు బిల్లు 335 యూనిట్లు వచ్చిందని, అందుకే నిధులు పడలేదని చెప్పారు. కరెంటు ఆఫీసుకు వస్తే 300లోపే యూనిట్లు వచ్చాయని చెబుతున్నారు. అసలు ఏం జరుగుతుందో అర్థం కావడం లేదంటూ కృష్ణ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంబంధం లేని నంబర్లు యాడ్ అయ్యాయి


వాంబే కాలనీకి చెందిన బొమ్మాళి కరుణ్‌కు ముగ్గురు పిల్లలు. గవర్నమెంట్ స్కీం ఇంట్లో నివసిస్తున్నారు. వారికి 3 కరెంటు మీటర్లు ఉన్నాయని, కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందని తల్లికి వందనం డబ్బులు ఆపేశారు. తమకు సంబంధం లేని మూడు నంబర్లు ఆయన ఆధార్‌కు యాడ్ అయిపోయాయి. అసలు ఆ మూడు నంబర్లు ఎవరివో కూడా తనకు తెలియదని, ఏం చేయాలో అర్థం కావట్లేదని వాపోయారు. కరెంటు ఆఫీసుకు వచ్చి పాట్లు పడుతున్నామని తెలిపారు. పథకం ఇస్తానంటే ఇవ్వాలి. లేకపోతే లేదు. ఇన్ని ఇబ్బందులు పెట్టడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

..తల్లికి వందనం పథకం కోసం అర్హుల పడుతున్న పాట్లు ఇవి. ఒకవైపు అర్హులైన తల్లులందరి ఖాతాల్లోకి నిధులు జమ చేశామంటూ పాలకులు ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నారు. కానీ, ఆ నిధులు జమ కాక పిల్లల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. 300 యూనిట్లు వాడకపోయినా వాడినట్లు, సంబంధం లేని నంబర్లు వారి ఆధార్‌కు లింక్ అయిపోవడం వంటి సమస్యలెన్నో తలెత్తడంతో సచివాలయాలు, విద్యుత్ శాఖ కార్యాలయం చుట్టూ స్టేట్‌మెంట్లు, ఇతర పత్రాల కోసం ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.


మధురవాడ ఈఆర్‌వో ఆఫీసు వద్ద స్టేట్‌మెంట్ల కోసం క్యూలో నిరీక్షిస్తున్న వినియోగదారులు

- 300 యూనిట్లు విద్యుత్ వాడారంటూ నిధుల నిలిపివేత
- అన్ని యూనిట్లు వాడకపోయినా వాడినట్లు చూపిస్తున్న వైనం
- పత్రాల కోసం కరెంటు ఆఫీసు వద్ద భారీ క్యూలు
- విద్యుత్ శాఖ సిబ్బంది దురుసు ప్రవర్తనతో పరీక్ష
- పాలకుల తీరుపై ప్రజల ఆగ్రహం


స్టేట్‌మెంట్లు అందజేస్తున్న సిబ్బంది

మధురవాడ : తల్లికి వందనం పథకం అందక అర్హులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ చదువుకు ప్రోత్సాహం అందించేలా తల్లికి వందనం కింద రూ.15వేలు వేస్తామని చెప్పారు. చివరికి దానిని రూ.13వేలకు కుదించారు. అది కూడా పడకపోవడానికి 300 యూనిట్ల పైన విద్యుత్ వాడకమే కారణం అని మెలిక పెట్టడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. పైగా వీరు అర్హుల జాబితాలో చేరాలంటే 300 యూనిట్ల లోపు విద్యుత్ వాడినట్టు పత్రాలు సమర్పించాలని పాలకులు ప్రకటించారు. దీంతో డబ్బులు పడని లబ్ధిదారులు మధురవాడలోని విశాఖ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం, విద్యుత్ శాఖ కార్యాలయాల సముదాయంలో ఉన్న ఈఆర్‌వో (విద్యుత్ శాఖ రెవెన్యూ కార్యాలయం) వద్దకు అధిక సంఖ్యలో వస్తున్నారు. వీరికి ఆ శాఖ సిబ్బంది సక్రమంగా సమాధానం చెప్పకపోవడంతో ఒక్కొక్కరూ రెండు మూడు రోజులు ఈ ఆఫీసు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

మూడు నియోజకవర్గాలకు మధురవాడలోనే పత్రాలు

భీమిలి, విశాఖ తూర్పు, విశాఖ పశ్చిమ నియోజకవర్గాల పరిధి మధురవాడ, పీఎం పాలెం, కొమ్మాది సబ్‌స్టేషన్లతో పాటు ఇటు పద్మనాభం, భీమిలి, సాగర్‌నగర్, అటు పెందుర్తి, గోపాలపట్నం మధ్య ఉన్న వివిధ సబ్‌స్టేషన్ల పరిధిలోని వేలాది మంది ఇక్కడికే వచ్చి తప్పుల సవరణ చేయించుకోవాల్సి వస్తుంది. వారంతా ఆ బిల్లులకు సంబంధించిన స్టేట్‌మెంట్ల కోసం ఇక్కడికే రావాల్సి వస్తోంది. వాస్తవంగా ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోనే పత్రాలు ఇవ్వాల్సి ఉన్నా, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా వినియోగదారులంతా ఇక్కడికే వస్తున్నారు. అయితే ఇక్కడ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. ఏ సబ్‌స్టేషన్ పరిధిలో వారికి ఆ పరిధిలోనే ఈ పత్రాలు ఇచ్చేవిధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మహిళలను చేత్తో నెడుతున్నారు

మాకు కరెంటు బిల్లు ఎక్కువ వస్తోందని ఇక్కడికి వచ్చాను. ఇక్కడ కంప్యూటర్ దగ్గర స్టేట్‌మెంట్లు ఇస్తున్న వ్యక్తి మహిళలను తాకి, చెయ్యిపెట్టి బయటకు నెడుతున్నారు. ఈ విషయమైన నేను ఇక్కడ ఏఏవో మేడమ్‌కు చెప్పాను. మహిళల పట్ల ఇలా వ్యవహరించడం సరికాదు.

– జి. ప్రసాద్, నగరంపాలెం

అర్హుల జాబితాలో ఉన్నా డబ్బులు పడలేదు


మాకు ఇద్దరు పిల్లలు. పాప 9వ తరగతి, బాబు 5వ తరగతి చదువుతున్నారు. నేను స్వతంత్రనగర్‌లో కుటుంబంతో పాటు నివాసం ఉంటున్నా. నా పేరు అర్హులు జాబితాలో ఉంది. కానీ, నిధులు పడలేదు. వస్తాయి అని చెబుతున్నారు. ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు.

– తమ్మిన కుమారి, మధురవాడ

క్లుప్తంగా

ఉపాధి హామీ పనులకు భూమిపూజ


గోస్తని నది వద్ద భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రశేఖర్

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.9 లక్షలతో చేపట్టనున్న పనులను వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు చంద్రశేఖర్ బుధవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. గోస్తని నది నుంచి గ్రామానికి ఆనుకుని ఉన్న ప్రాంతంలో లోతు చేయనున్నట్టు తెలిపారు. పంచాయతీ వాసులకు గ్రామంలోనే పనులు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ పూజా కార్యక్రమాలలో పల్లా సన్యాసిరావు, తమ్మిన రాము, పొట్నూరు రాము, పొట్నూరు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం


చిట్టివలస డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

తగరపువలస: సంపూర్ణ ఆరోగ్యానికి నిత్యం యోగాసనాలు సాధన చేయాలని చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాలలో యోగాసనాలపై అవగాహన కార్యక్రమంలో ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగాను మించిన సాధనం లేదన్నారు. భీమిలి ఇంటర్నేషనల్ యోగా సెంటర్‌కు చెందిన కపాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది యోగా సాధన చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ కోరారు.

22న ఉచిత ధ్యాన శిబిరం

తగరపువలస: ఈ నెల 22న శ్రీరమా సత్యనారాయణస్వామి కొండపై గల గీతామందిరంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఒక్కరోజు ధ్యాన ఆధ్యాత్మిక శిబిరానికి నిర్వాహకులు ఆహ్వానం పలుకుతున్నారు. ఈ శిబిరానికి హాజరయ్యేవారు నోట్‌బుక్, పెన్ను తీసుకురావాలని సూచించారు. పాల్గొన్నవారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునేవారు 81438 10608, 94907 02542 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు కార్మికవాడ అలంక వారి వీధిలో ఆర్థిక ఇబ్బందులతో కనకరాజు(40) అనే వ్యక్తి మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలివి.. మధురవాడకు చెందిన కనకరాజు భార్య, ఇద్దరు పిల్లలతో చిట్టివలసలో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా చికెన్ దుకాణంలో పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నారు.

వృత్తి విద్యా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ: విశాలాక్షినగర్ దయాల్‌నగర్‌లోని దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ సంస్థలో 2025–26 విద్యా సంవత్సరానికి వృత్తి విద్యా కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రెస్ డిజైనింగ్ అండ్ ట్రైనింగ్, టెక్స్‌టైల్ డిజైనింగ్, కటింగ్ అండ్ సుయింగ్, మోటార్ కార్ మెకానిజం, మోటార్ బైక్ మెకానిజం, ఆఫీస్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్, మొబైల్ రిపేర్ అండ్ మెయింటినెన్స్ తదితర వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆయా కోర్సులను బట్టి విద్యార్హత 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. వాటిలో మహిళలు, పురుషులకు కోర్సులు కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు జూలై 1 లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 99633 40611 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆత్మీయ పరామర్శ


మృతుల చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కేకే రాజు, చిన్న శ్రీను

తగరపువలస: ఆనందపురం మండలం గండిగుండంలో ఇటీవల ఒకే కుటుంబంలో మరణించిన తండ్రీకుమారులు మదపాడ అచ్చిబాబు, బంగారయ్యలకు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి గండ్రెడ్డి శ్రీనివాస్, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీలు బొట్ట రామకృష్ణ, పాండ్రంగి శ్రీను తదితరులున్నారు.

కవిత కుటుంబానికి ఓదార్పు


కవిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శ్రీనివాసరావు

భీమునిపట్నం: స్థానిక కృష్ణా కాలనీకి చెందిన బంగారు కవిత మృతి చెందడంతో, ఆమె కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు బుధవారం పరామర్శించారు. నెల రోజుల క్రితం అదృశ్యమైన కవిత రెండు రోజుల క్రితం శవమై కనిపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమె ఇంటికి వెళ్లిన మజ్జి శ్రీనివాసరావుకు కవిత భర్త పైడిరాజు జరిగిన విషయం గురించి వివరించారు. తాము ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించి ఉంటే తన భార్య మరణించి ఉండేది కాదన్నారు. వారి నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని తెలిపారు.

పోలీసులు అంకితభావంతో పని చేయాలి

విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్


మాట్లాడుతున్న విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్

కొమ్మాది: ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ సాగరతీరంలో విధులు నిర్వర్తించే పోలీసులు అంకితభావంతో పనిచేయాలని విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్ కోరారు. రుషికొండ ఏ1 ఫంక్షన్ హాల్లో భద్రత విధులపై పోలీస్ అధికారులు, సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుతో పాటు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనే ఈ కార్యక్రమంలో భాగంగా విశాఖ ఐటీ సెజ్ నుంచి కాపులుప్పాడ వరకు 59 కంపార్ట్‌మెంట్లతో విస్తృతస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భద్రత విధులు నిర్వర్తించే పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమానికి బస్సుల్లో చేరుకునే ప్రజలు వచ్చిన తరువాత, బస్సులు పార్కింగ్ స్థలాలకు చేరేలా చూడాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా జిల్లా నుంచి విశాఖ వెళ్లే మార్గంలో కొత్తవలస మండలం చింతలపాలెం, డెంకాడ మండలం రాజాపులోవ వద్ద రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నిరంతరం ఈ రెండు చోట్ల వాహనాల తనిఖీ ఉంటుందన్నారు. సమావేశంలో ఏఆర్ ఎస్పీ ఆశోక్‌కుమార్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

9న అఖిల భారత పారిశ్రామిక సమ్మె


సిటు మండల మహాసభలో పాల్గొన్న నాయకులు

తగరపువలస: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న నిర్వహించనున్న పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని సిటు భీమిలి జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి కోరారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన సిటు భీమిలి మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కార్మిక హక్కులు కాపాడాలని, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలని, తొలగించిన కార్మికులకు వెంటనే విధుల్లోకి తీసుకోవాలనే డిమాండ్లతో సమ్మెకు దిగనున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నాయన్నారు. నిత్యావసర సరకుల ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఈ సందర్భంగా జరిగిన కార్యవర్గ ఎన్నికలలో సిటు మండల అధ్యక్ష, కార్యదర్శులుగా నీలాతి రాము, గొరుసు శ్రీను, ఉపాధ్యక్షునిగా పల్లా పెంటరాజు, సహాయ కార్యదర్శిగా ముగడ ఈశ్వరరావు, కోశాధికారిగా సుగాశి వెంకట సత్యంను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులను ఆశ, అంగన్‌వాడీ, వీవోఏ, క్వారీ, తోపుడు బండ్ల రంగాల నుంచి ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, ముద్దాడ రాము, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి కట్టుబడి ఉందాం


ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

పద్మనాభం: దేశాభివృద్ధి, దేశ రక్షణకు అందరూ కంకణం కట్టుకోవాలని బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవి కుమార్ కోరారు. మండలంలోని అనంతవరంలో బాపన చెరువు వద్ద బుధవారం నిర్వహించిన వికసిత్ భారత్‌లో ఈ మేరకు అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా ప్రధాని మోదీ సుపరిపాలన అందిస్తున్నారు. 11 ఏళ్లలో పది గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలు నిర్మించారని తెలిపారు. మహిళా సాధికారతకు కృషి చేస్తున్నారన్నారు. బీజేపీ మండల అధ్యక్షురాలు తమటపు నాగమణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల శాఖ ఉపాధ్యక్షుడు మచ్చ సోమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిరిపురపు వెంకటరావు, కలగర్ల పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు కాస్త ఉపశమనం

సాక్షి ఎఫెక్ట్..


డ్రైనేజీ పూడికపై బ్లీచింగ్ పౌడర్ చల్లిన దృశ్యం

పీఎం పాలెం: జీవీఎంసీ పారిశుధ్య విభాగం నిర్లక్ష వైఖరిపై 'పూడిక తీసి .. వదిలేశారు' శీర్షికన బుధవారం వెలువడిన వార్తకు అధికారులు స్పందించారు. చర్యలు చేపట్టారు. వివరాలివి.. ఇటీవల కారుషెడ్ కూడలి నుంచి కొమ్మాది కూడలికి వెళ్లే సర్వీసు రోడ్డు పొడవునా ఉన్న డ్రైనేజీలో పేరుకుపోయిన పూడిక వెలికతీత పనులు చేపట్టారు. అయితే, ఆ వ్యర్థాల పోగులను అక్కడే వదిలేయడంతో వాటి నుంచి వెలువడుతున్న దుర్గంధం కారణంగా ఆ రోడ్డులో ప్రయాణిస్తున్న పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడేవారు. దీనిపై సాక్షిలో ప్రచురితమైన కథనానికి పారిశుధ్య విభాగ అధికారులు స్పందించారు. దుర్గంధం వ్యాపించకుండా ముందుగా పూడికలపై బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఆ రోడ్డులో ప్రయాణించే వారికి ఉపశమనం కలిగించారు.

సమష్టి కృషితో పార్టీ బలోపేతం

- పని చేసేవారికి ఎప్పుడూ గుర్తింపు
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు


పార్టీ నాయకులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలిలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం కావడానికి పార్టీలో ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి సమీపంలోని గొల్లలపాలెం వద్ద పార్టీ మూడో వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నామని ఎవరూ అధైర్యపడవలసిన అవసరం లేదని, ప్రజల్లో అభిమానం, ఆదరణ అలాగే ఉన్నాయని అన్నారు. ఏవిధంగా పని చేయాలన్న దానిపైనే ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని, ఆమేరకు కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.

రెండు రోజుల్లో నియామకాలు

గతంలో భీమిలి మున్సిపాలిటీగా ఉన్నప్పుడు ప్రస్తుత మూడో వార్డు పరిధిలో 15 నుంచి 24వ వార్డు వరకు పది వార్డులు ఉండేవని, ఇప్పుడు దాన్ని దృష్టిలో పెట్టుకుని ఇక్కడ ఆయా వార్డుకు ఒక అధ్యక్షుడిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లోని నాయకుల ఆమోదంతో అధ్యక్షుల ఏర్పాటు జరగాలని, తద్వారా అన్ని ప్రాంతాల్లో కార్యక్రమాలు బాగా జరగడానికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. రెండు రోజుల్లో వీరి నియామకాలు జరిగేవిధంగా చూడాలన్నారు.

నిత్యం అందుబాటులో ఉంటా..

పార్టీ కోసం బాగా పని చేసేవారికి కచ్చితంగా మంచి గుర్తింపు ఉంటుందని చిన్న శ్రీను అన్నారు. ఈ విషయంలో ఎవరికీ అనుమానాలు అవసరం లేదని, తాను చర్యలు తీసుకుంటానని చెప్పారు. పార్టీలో నాయకులు, కార్యకర్తలందరికీ నిత్యం అందుబాటులో ఉంటానని, ఎవరికి ఎలాంటి అవసరం వచ్చినా తనను సంప్రదించవచ్చని అన్నారు. ప్రజలకు, పార్టీకి మేలు జరిగే కార్యక్రమాల్లో అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు, నాయకులు కోండ్రు రామసూరప్పడు, వాసుపల్లి కొండబాబు, ఎస్.కరుణాకర రెడ్డి, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, కదిరి ఎల్లాజీ, గుండాలి మధునాయుడు, అనపర్తి సూర్యప్రకాశరావు, ముక్కి కృష్ణ, చెల్లూరి గౌరినాయుడు, బాకి రమణారెడ్డి, బోని సంజీవరావు, బోర నాగరాజు, కొంకుపూడి ఎర్రిబాబు, వాడమొదల జగ్గారావు, బోని శ్రీను, బాలకృష్ణ, గేదెల సత్యనారాయణ, అస్లాం ఖాన్, సీహెచ్. పద్మరాజు, అశోక్, జగదీష్ పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ దంపతుల వితరణ

- పాఠశాలకు లాప్‌టాప్ బహూకరణ

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు అమెరికాలో నివాసం ఉంటున్న ఎన్‌ఆర్‌ఐ దంపతులు దుర్గా మల్లికార్జునరావు, సావిత్రి దంపతులు లాప్‌టాప్ బహూకరించారు. బుధవారం పాఠశాలకు వచ్చిన దాతలు, లాప్‌టాప్‌ను పాఠశాల ప్రతినిధులకు అందజేశారు. వారు మాట్లాడుతూ పాఠశాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంలో భాగంగా దీనిని అందించామన్నారు. ఉపాధ్యాయులు లలిత, శివగంగ, వరలక్ష్మి, ప్రసాద్ పాల్గొన్నారు.

'యోగాంధ్ర'లో పాల్గొనేవారికి 11 చోట్ల వసతి

సబ్బవరం: యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు రానున్న యోగా సాధకులు 3,110 మందికి సబ్బవరంలో వసతి ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. ఇందులో భాగంగా కళాశాలలు, పాఠశాలలు, కన్వెన్షన్ హాళ్లలో ఏర్పాట్లను సీఐ రామచంద్రరావుతో కలిసి బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చోడవరం, చీడికాడ, కోటపాడు మండలాల నుంచి 20వ తేదీన వచ్చే వారి కోసం మండలంలో 11 చోట్ల బస ఏర్పాట్లు చేశామన్నారు. ఆ రోజు రాత్రికి భోజనాలు, 21న ఉదయం స్నాక్స్ అందిస్తామన్నారు.